# చీడపురుగు

ఘంటా

★

పువ్వు పుట్టగానే వాసన తెలిసిపోతుందన్న సామెత మా ప్లాట్‌ఫారంమీద పత్రికలమ్మే కుర్రవాడివిషయంలో అక్షరాల వర్తిస్తుంది. వాడా పనిలో చేరీచేరకముందే ప్రజలదృష్టిని సూదంటురాయిలా ఆకర్షించేడు. రకరకాల పిలుపులు పిలిచి పత్రిక అంటగట్టకుండా ఒక్క చదువరినిగూడా దాటిపోనిచ్చేవాడుగాదు తాను మోయగలిగినన్ని పత్రికల్ని చిటికెలో ఎగరగొట్టేసేవాడు. వాడి చమత్కారపు పిలుపులు వింటుంటే అవని కొరకేవాడు జన్మించేడా అనిపిస్తుంది.

ప్రతిరోజూ అరగంట తాళిన తర్వాత ఇంటివద్దనుండి సర్వెంటు పేపరు తెస్తాడు కాబట్టినాకు వాడివద్ద పత్రిక కొనవలసినఅవసరం లేకుండపోయింది వాడు చేరినదగ్గరనుంచి తన చతురతనంతా ఉపయోగించి నాచేత పత్రిక కొనిపించాలని ఎన్నో తంటాలు పడ్డాడు కాని వాడి ఆటలు నాముందు సాగలేదు.

ఉదయం ఎనిమిది గంటలకు రైలు స్టేషనులోకివచ్చింది. నేను అలవాటుప్రకారం పనిఆపి వచ్చేపోయే రకరకాల జనాంగాన్ని చూచేందుకు ప్లాట్‌ఫారంమీద నిల్చున్నాను. వాడు పేపరుకట్ట చంకలో పెట్టుకొని మెరుపులాగా ప్లాట్‌ఫారంమీదికి వచ్చేడు. వాడు ధోరణి వాడు మొదలు పెట్టేడు "పత్రిక బాబూ, పత్రిక! అరుపేజీలు ఒక్కణా. కాలు కదపకుండ ప్రపంచాన్ని తెలుసుకో వచ్చు. కొరియాయుద్ధంలో క్రొత్తపరిణామాలు. విశాఖపట్నంలో వింతసంఘటనలు. చదవండి బాబూ చదవండి. ఆరుపేజీలు ఒక్కణా అంటే నాలుగుకానులు" దానితోచాలవరకు అమ్ముడుపోయేయి. ప్రతి రెండుమూడు నిమిషాలకు నన్ను చుట్టి పోతూనే వున్నాడు. కాని వాడి చేతిలోని పత్రిక నాచేతిలో చేరలేదు.

ఒక్క పత్రికను మాత్రం మిగిల్చి చేతిలో పట్టుకున్నాడు. చివరిసారిగా దాటిపోతూ, "నాయకుడి మరణాన్ని గురించి తెలుసుకోవాలంటే పత్రిక చదవండి. త్వరపడండి" అన్నాడు అంతకుముందురోజు పత్రికలో ఒక దేశనాయకుడు జబ్బుగావున్నట్లు చదివేను. అతడే మరణించి వుంటాడనుకున్నాను దాని పూర్తివివరాలు తెలుసుకోవాలని మనసు తహతహలాడింది. నా పత్రిక వచ్చేదాక అయ్యే ఆలశ్యాన్ని ఓర్చుకోలేక అణా వాడిచేతిలోపెట్టి పత్రిక తీసుకొని అన్ని పేజీలు తిరగవేసేను. ఎక్కడా ఆవార్త కనిపించలేదు, మూడోపేజీ చివరికాలంలో ఎవడో ఒకదొంగలనాయకుడు!మరణించినట్లు ఉంది, చివరికి నన్నుకూడా బుట్టలో వేసుకున్నాడన్నమాట! అంతలో ఇంటివద్దనుండి నా పత్రిక నాకు రానే వచ్చింది, అణా నష్టపెట్టినందుకు, కాకపోయినా తెలిసికూడా వాడివల్లో చిక్కినందుకు కోపం ముంచుకొచ్చింది వాడు రోడ్డుప్రక్కన కనకం బహిరంగంగ హోటల్లో బెంచీమీదరీవిగా కూర్చుని ఒకచేత్తోబీడీ పట్టుకుని, రెండోచేత్తో కాఫీపుచ్చుకుంటున్నాడు. ఒకసారి తెలుసుకున్న దరువాతటో త్రాపడకూడదనుకున్నాను. అప్పటినుండివాడిమీద

ఒక కన్ను వేసి ఉంచేనని వేరుగా చెప్పనక్కర లేదనుకొంటాను

పై సంఘటన జరిగినతర్వాత కొద్దిరోజులు గడచిపోయాయి. ఒకనాడు పేపరుకట్ట చంకలో పెట్టుకొని ఒకచేత్తో రెండుమూడు పత్రికల్ని పైకెత్తి ప్రెసిడెంట్ ఎలక్షన్ వివరాలు తెలుసుకోవాలంటే ఈరోజు పత్రిక చదవండి. ఇన్నిరోజులనుంచి ఎదురుచూస్తూ ఉన్న వార్త నేడేచూడండి. అనుమానంతో అలసిస్తే ఆశాభంగము" అన్నాడు వాడిదంతా బూటకమే నని తేల్చేను. వాడుచెప్పే ప్రసిడెంటు ఎలక్షను ఏదికరాయక్క సంఘానికో సంబంధించి ఉంటుందనుకున్నాను. వాడి మాటలు నమ్మి విరగబడి పత్రిక కొంటూ ఉన్న వారితెలివి తక్కువ తనానికి నాలోనేను నవ్వుకుంటూ అలానే నిల్చుండిపోయేను. చూస్తూ చూస్తూ ఉండగానే వాడు వట్టి చేతులతో మిగిలిపోయేడు

ఆనాడు పత్రికచదివే ప్రతివాడిముఖంలో ఒక విధమైన ఆతురత ద్యోతకమవుతూఉంది. ఎవరి పత్రికనువారు ముక్కుందాక చేర్చుకొని చదువుతూవుండడం చూడగానే ఎలక్షను ఫలితాలు ప్రచురించేరోజు అదేనన్న విషయం జ్ఞప్తికి వచ్చింది. నా పత్రిక నాకు చేరేకాలము ఆసన్నమయినా,సర్వెంటు ఇంకారాలేదు. పూర్తివివరాలు కాకపోయినా, అంతరాజకీయ పార్టీకి ప్రెసిడెంటు అయినవాడి పేరైన తెలుసుకోవాలని కోరిక కలిగింది. మొదటిపేజీ చదువుతూఉన్న ఒక పెద్ద మనిషి వెనగ్గా వెళ్ళి నిల్చున్నానో లేదో, ఆ మహానుభావుడు వెనక్కి తిరిగి నావైపు చురచుర చూచి, ఒక్కవిసురుతో పేపరు ముడుచుకుని ఫర్లాంగున్నర నడిచిపోయి చదవడం మొదలు పెట్టేడు. దానితోనాకు అభిమానం ముంచుకొచ్చింది. నాజన్మలో అంతవరకు పరాయివాడి పేపరువైపు కళ్ళుమూసుకొని యైనా చూచి ఎరుని అవమానానికి గురికావలసివచ్చింది నేను

ఇంతకీ పోటీకి నిలుచున్న ముగ్గురిలో ఎవరు గెలుపొందేరా అన్న ప్రశ్ననన్ను తల్లక్రిందులు చేసింది అప్పటికి పత్రిక చేతుల్లోకి వచ్చి గంట దాటిపోతుఉంది. ఎవరినైనా అడిగి అధ్యక్షత స్థానం సంపాదించిన వాడిపేరు తెలుసుకుందామనుకున్నాను,కాని నేను ప్రపంచానికంటె గంట వెనుక బడివున్నానని చిన్నచూపుతో జవాబిస్తారని ఎవ్వరిని అడగలేదు.

వెంటనే అసిస్టెంటుతోచెప్పి సైకిలు తీసుకొని ఇంటికివెళ్లేను. నాధర్మపత్ని ఇంటికి నాలుగు వైపులా తాళాలుబిగించి ఎక్కడికో విడాయించింది. నాలుగుతలుపుల్ని నాలుగు తన్నులుతన్ని సరాసరి నాకు పత్రికఅందచేసే ఏజెంటువద్దకు వెళ్లేను వాడు గంటన్నరక్రితమే పత్రికఇంటికి చేరవేసేనని తక్కిన పత్రికలు అమ్ముడు పోయేయని చెప్పేడు మరుసటి రోజునుంచి పత్రిక స్టేషను లోనే మొదటనాకు అందచేయ వలసిందని వాడితోచెప్పి దగ్గరదారి పట్టుకొని స్టేషను చేరుకున్నాను.

అంతగొప్ప రైల్వేస్టేషన్ని పరిపాలిస్తున్న నన్ను ఒకఅనామకుడైన కుర్రకుంక అవమానించేడని తలంచుకున్నపుడు నా నర నరాల్లోకి రోషం పాకిపోయింది. వాడికి తగినశాస్తి జరిగించాలనుకున్నాను.

మరునటిరోజు పత్రిక స్టేషనుకురాగానే నా ఏజంటుకు ప్రథమంగా అందచేసి అందులో ఒకటి నేను చేతపట్టుకొని ధీమాగా ప్లాట్‌ఫారం మీదికి వెళ్ళి చదవడం మొదలుపెట్టేమా మనవాడు అమ్మకానికి బయలుదేరేవరకు ఐదారునిమిషాలు ఆలస్యమయింది నన్ను పత్రికకొనమని అడగడానికి వాడికి దమ్ములుండవుగదా అని నాలోనేను తృప్తి పడి కళ్ళతో పత్రికవైపు చూస్తూ చెవులతో వాడి మాటలు వినడం మొదులుపెట్టేను. వాడునాకు కొంచెందూరంలో నిల్చొ, "చదవండిబాబూ,

చదవండి- తాజావార్తలు, తాజా, తాజాకబుర్లు- నిమషందాటితే వార్తపాతబడి పోతుంది పాత వార్తంటే చెప్పదంటన్నమాట తెలివున్నవాళ్ళంతా నేనిచ్చే కొత్తపత్రిక చదవండి. నాణ్యమైన నాలుగుపేజీలు ఒక్కణా" అన్నారు. వాడి పిలుపు వింటూంటే నాశరీరం మీదికి పాములు, జెర్రులు పాకినట్టయింది. వాడు వుపయోగించే ప్రతిమాట నాకు బాణంలాగ దగిలింది. నేను పాతవార్తల్ని చదివి చెప్పదంటుల్ని తింటున్నానట, అంతేకాకుండ తెలివితక్కువ వాడనట ఏమివాడి పొగరు!

నా అధికారాన్ని ఉపయోగించి వాడినోరుకట్టివేయ సమకట్టేను, తిక్క కుదుర్చుకొని నా కాళ్ళ వద్దకు వచ్చేదాకా వాడ్ని వదిలిపెట్ట తలంచుకోలేదు.

మెయిలు డిపార్టుమెంటులో పనిచేసే గుమస్తాకు చెప్పి వాడిపత్రికలు గంటఆలస్యంగా వాడి చేతికి చేరేఏర్పాటు చేసేను వాడుగంటసేపు నిలువుకాళ్ళమీద ఆఫీసుకు ఎదురుగా, పడిగాపులు గాస్తుంటే చూసిసంతోషించేను, గంటవ్యవధిలో స్టేషనులో జనంగూడ పల్చబడేవారు వాడి పిలుపుల్లోమునుపటి రీతిగా జీవంలేదు, నాకళ్లు చల్లబడ్డాయి.

వాడి దీనావస్థ మూడురోజులుచూచి ఆనందించేను, నాలుగోరోజు చేతికిపత్రికలు రాగానేవాడి కళ్ళలో ఒక్కమెరుపు మెరిసింది ఒక్కపరుగులో నాఆఫీసుకు పక్కగావున్న మండపాన్నిఎక్కి 'చదవండిబాబూ, చదవండి- పత్రికావ్యతిరేకి పిచ్చిచేష్టలు చదవండి, చదవటమేగాదుది ఆచీడ పురుగుని మీమధ్యలోనుంచి చెదరగొట్టండి' అని ఎలుగెత్తిఅరవడం మొదలుపెట్టేడు వాడిపిలుపుతో నావళ్లుఝల్లుమంది భూమిమీదకాళ్లు నిల్వలేదు, పైపైనచూసి సొరుగులోతోసిన పత్రికను తెరిచి ప్రతిశీర్షిక పరిశీలించి చూసేను, మూడోపేజీ నాలుగోకాలంలో 'చీడపురుగు' అన్న శీర్షికగల వ్యాసాన్ని చదువుతూవుంటే అందులోని ప్రతిఅక్షరంలో నాప్రతిబింబంమెరిసి కళ్లుపీల్చుకమ్మేయి. ఆవ్యాసం ఈక్రిందివిధంగా అంతమయిం- "ఇది ప్రచురణఅయిన మూడుదినాల్లో ఆచీడపురుగుచీడ వదిలించుకోకపోతే పత్రికాముఖంగా మేమే వదిలించ వల్సి వస్తుంది"

చేయిజారి క్రిందపడిపోయిన హేటుతీసి తగిలించుకోబోతుంటే, పక్కనపోతూవున్న పోర్టరుఆగి 'దుమ్ము దులుపుకు పెట్టుకోండి' అన్నాడు. 'థేంక్స్' అన్నమాట నా పెదవులనుండిజారింది,

---

హాస్యకర్త అయిన ఒకనటుడు సాక్ష్యం ఇవ్వడానికి ఒకనాడు బోనులో నిలబడి ఉండగా అవతలపార్టీ ప్లీడరు క్రాసులో ఇతణ్ణి పంచిద్దామని.

ప్లీడరు : తమవృత్తి అభినయించడం కదూ?
నటుడు : అవును.
ప్లీ : అది చాలా నీచం కదూ?
న (నవ్వి) అది నాకంత బాగా తెలియదు, కాని అది మా నాన్నవృత్తికంటె చాలా నయం
ప్లీ అయినవృత్తేమిటి?
న ఏముంది మన ప్లీడరీ వృత్తే!
ప్లీ ఎందుచేత నయం?
న. ప్లీడరీ నిజంగా అబద్ధం, అభినయం అబద్ధంగా నిజం.

—తమిడిపాటి కామేశ్వరరావు